## క్లుప్తంగా

### హుండీ ఆదాయం లెక్కింపు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని ప్రథమ నందీశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం హుండీ ఆదాయం లెక్కించారు. ఈఓ వీఎల్ఎన్ రామానుజన్, పర్యవేక్షణ అధికారి హరి చంద్రా రెడ్డి ఆధ్వర్యంలో మూడు నెలల హుండీ ఆదాయాన్ని లెక్కించగా రూ.1,70,176 ఆదా యం లభించిందని తెలిపారు. ఆలయ అర్చకులు రాఘవేంద్రశర్మ, ప్రవీణ్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు.

### సమస్యలను పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా సెక్రటరీ ఓబులేసు మాట్లాడుతూ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన కార్మికుల ఇంట్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. రంజిత్, శివరాం, మస్తానయ్య, కార్మికులు, పాల్గొన్నారు.

### సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం

గోస్పాడు: ప్రతి ఒక్కరికి సమాచార హక్కు చట్టంపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరముందని మండల వ్యవసాయాధికారి స్వప్నికారెడ్డి తెలిపారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో సోమవారం మండలస్థాయిలో సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అర్జీదారుడు కోరిన సమాచారాన్ని అందించాలని 30 రోజుల గడువులోపు అందజేయాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

### ఈ-కేవైసీ నమోదు తప్పనిసరి

గోస్పాడు: ఈ-కేవైసీ నమోదు తప్పనిసరిగా పూర్తి చేయాలని తహసీల్దార్ షేక్‌మొహిద్దీన్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం వీఆర్‌ఓలు, వ్యవసాయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు సాగు చేసిన పంటలను ఈ-క్రాప్ నమోదుతో పాటు ఈ-కేవైసీ కూడా సక్రమంగా నమోదు చేయాలన్నారు. గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు కూడా నిర్వహిస్తున్న ట్లు తెలిపారు. ఈనెల 10న గోస్పాడు, 11న ఒంటివెలగల, 12న ఎస్.కూలూరు, 13న యాళ్లూరు, 17న కానాలపల్లె, 18న ఎస్.నాగులవరం, 19న రాయపాడు, 20న తేళ్లపురి, 21న ప సురపాడు, 24న ఎం.చింతకుంట్ల, 26న సాంబవరం, 27న ఎం.కృష్ణాపురం, 28న జిల్లెల్ల గ్రామాల్లో సదస్సులు ఉంటాయని వివరించారు.


### ఉర్దూ కళాశాలకు కంప్యూటర్లు అందజేత

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఉర్దూ జూనియర్ కళాశాలకు కంప్యూటర్లను పంపిణీ చేసినట్లు ప్రిన్సిపాల్ కరీముల్లా తెలిపారు. సోమవారం ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు కంప్యూటర్లు అవసరం కాగా మంత్రి ఫరూక్ ఆదేశాల మేరకు మంత్రి తనయుడు ఫయాజ్ కంప్యూటర్లను కళాశాలకు అందజేయడం అభినందనీయమన్నారు. ఖలీల్ అహమ్మద్, ఇమామ్‌ల సంఘం అధ్యక్షుడు అంజాద్‌బాషా, మల్లికార్జున, చాంద్, ప్రభాకర్ పాల్గొన్నారు.

### నేడు రెవెన్యూ గ్రామసభ

దొర్నిపాడు: దొర్నిపాడులోని కోటస్కూల్‌లో మంగళవారం రెవెన్యూ గ్రామ సభను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సుభద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భూ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అర్జీలను స్వీకరించి క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కారం చూపుతామన్నారు.

### ముందస్తు క్రిస్మస్ వేడుకలు



క్యాండిల్ లైట్ సర్వీసులో పాల్గొన్న వైద్యులు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక కార్మెల్ చర్చిలో సోమవారం ఐఎంఏ నంద్యాల శాఖ ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. పట్టణ ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ మధుసూదన రావు ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాలకు హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ క్యాన్సర్ శస్త్ర చికిత్స నిపుణుడు డాక్టర్ చిన్నబాబు ముఖ్య వక్తగా, పాస్టర్ పాల్ వీరాంజనేయులు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ దేవుడికి మనిషికి మధ్య అనుసంధానం కొనసాగినప్పుడు మనిషి తన ధర్మాన్ని సక్రమ మార్గంలో పాటించే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి కొవ్వొత్తులు వెలిగించారు. డాక్టర్లు రవికృష్ణ, రాజశేఖర్, మోహన్, కిశోర్, సుమంత్, రూఫస్, కిరణ్, జఫ్రుల్లా, రాణి ప్రమీల, రేచల్, గ్లోరి, కెనడీ పాల్గొన్నారు.

### ప్రకృతి వ్యవసాయం ఉత్తమం

రుద్రవరం: ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయలతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఆర్గానిక్ ఎంసీఆర్పీ బాలస్వామి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయలు, ఆకుకూరలతో స్టాల్స్ ఏర్పాటు చేశారు. చుట్టుపక్కల గ్రామాల్లో ఒక్కొక్కరు 20 సెంట్ల స్థలంలో రసాయన ఎరువులు, పురుగు మందులు లేకుండా కేవలం ప్రకృతి వ్యవసాయంతోనే 16 రకాల కూరగాయలు, ఆకుకూరలు పండిస్తున్నారని తెలిపారు. ప్రజలకు అవగాహన కలిగించి వినియోగించేలా చేసేందుకే ప్రతి సోమవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద స్టాల్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.



☛ ఇక్కడ కేబుల్ వైర్ కట్ చేసుకునిపోయినట్లు కనిపిస్తున్న ఈ మోటర్ యాదవాడ గ్రామంలోని ఎలిమెంటరీ స్కూల్ ఎదురుగా ప్రదాన రోడ్డు పక్కనే ఉంది. గత వారం, పది రోజుల్లో మోటర్ స్టార్టర్ రివర్స్‌కొట్టి 2 సార్లు కాలిపోయేలా చేశారు. రెండుసార్లు మోటర్ తీసి చుట్టించి దించుకునేందుకు రూ.18 వేల వరకు ఖర్చు అయింది. మళ్లీ ఆదివారం రోజు రాత్రి కేబుల్ వైర్ కోసుకుపోయారు. దీంతో రైతు నరసింహారెడ్డి ఇలా అయితే పంటలు ఎలా పండించుకోవాలో అని ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు.

ఒసారి కాల్చి.. మరోసారి కేబుల్ కట్ చేసుకుపోయి

☛ సీఎం రోడ్డు నుంచి ఓబులంపల్లె రోడ్డు పక్కన కేబుల్ వైర్లను కోసుకుపోయిన దృశ్యాన్ని చూస్తున్న ఈ రైతు రుక్మానందుడు. నెలకు 5 నుంచి 6 సార్లు కేబుల్ వైర్లు కోసుకుపోతుండటంతో వేలకు వేలు ఖర్చు భరించలేక గుంతతీసి ఇనప పైపు పూడ్చి అందులో నుంచి కేబుల్ వైర్ కనెక్షన్ ఇచ్చుకున్నారు. అయినా దుండగులు గుంత తీసి కేబుల్ వైర్ కట్ చేసుకుపోయారు. కేబుల్ వైర్లను కాపాడుకుని పొలాలకు నీళ్ల పెట్టుకోవాలంటే ఏం చేయాలో అర్థం కావడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



భూమిలో పూడ్చి పెట్టినా వదలలేదు

☛ ఇలా ఈ ఇద్దరు రైతులే కాదు ఆళ్లగడ్డ రూరల్ మండల పరిధిలోని గ్రామాల్లో నిత్యం దొంగలు రెచ్చిపోతున్నారు. వ్యవసాయ మోటర్ల స్టార్టర్లు, ఫీజు క్యారియర్లు ధ్వంసం చేయడం, మోటర్లను కాల్చడం, కేబుల్ వైర్లను ఎత్తుకెళ్లడంతో పాటు బోర్లలో రాళ్లు వేసి పూడ్చి వేయడం చేస్తున్నారు. నెల వ్యవధిలో సుమారు 100 పైగా ఇలాంటి సంఘటనలు జరిగినట్లు తెలుస్తోంది. ప్రకృతి విపత్తులతో.. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలేక నష్టపోతున్న రైతులకు ఈ సంఘటనలు మరింత కుంగదీస్తున్నాయి.

# ధ్వంసం చేసి.. దొంగిలించి

- వ్యవసాయ మోటార్లు కాల్చి.. కేబుల్ వైర్లు కోసుకుపోతున్న దొంగలు
- బోర్లలో రాళ్లు వేసి పూడ్చివేస్తున్న దుండగులు
- టేకు చెట్లు నరికి ఎత్తుకెళ్లిన వైనం
- అన్నదాతల్లో కలవరం

ఆళ్లగడ్డ: పొలం పనుల్లో బిజీగా ఉన్న సయంలో విద్యుత్తు మొటర్లను కాల్చడం.. బోర్లలో రాళ్లు వేసి పూడ్చి వేయడం.. కేబుల్ వైర్లు కోసుకుని ఎత్తుకెళ్లడం వంటి ఆకతాయి పనులు అన్నదాతలను కలువరపెడుతున్నాయి. కొత్తవి ఏర్పాటు చేయడం తలకు మించిన భారవవుతుండగా చోరీల నియంత్రణ దిశగా పోలీసులు వహిస్తున్న నిర్లక్ష్య ధొరణితో దొంగల ఆగడాలకు అడ్డుకట్ట పడటం లేదు.

**పగలు రెక్కీ.. రాత్రి చోరీ**

పగలు రెక్కీ నిర్వహించి రాత్రిళ్లు చోరీలకు పాల్పడుతున్నారు. వీరికి అనుమానం రాకుండా బోర్ల సమీపంలో మద్యం తాగుతున్నట్లు కూర్చోవడం.. ఆపై ఎవరూ లేరని నిర్ధారించుకున్న తర్వాత ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారు. సాధారణంగా విద్యుత్ మోటర్ రన్నింగ్‌లో ఉండగా దొంగిలించాలంటే అవగాహన ఉండాలి. ఇందులో ఆరితేరిన ముఠానే ఇలాంటి ఘటనలకు పాల్పడుతోంది.

**టేకు చెట్టు నరికి ఎత్తుకెళ్లిన దొంగలు**

మండలంలోని ఓబులంపల్లె గ్రామంలో రైతు నడిపి ఓబన్న పొలంలో ఉన్న టేకు చెట్టును కొందరు దొంగలు నరికి ఎత్తుకుపోయారు. ఓబన్న పొలం దగ్గర సుమారు 15 సంవత్సరాలుగా టేకు పెంచుకుంటున్నాడు. నాలుగైదు రోజులుగా పొలం దగ్గరకు వెళ్లని ఓబన్న శనివారం పొలం దగ్గరకు వెళ్లే సరికి టేకు కనిపించలేదు. ఆశ్చర్యానికి గురైన ఓబన్న దగ్గరకు వెళ్లి చూడగా చెట్టు మొదలుతో పాటు కొమ్మలు సహా దొంగలు ఎత్తుకుపోయారని గమనించి లబోదిబోమంటున్నాడు. ఈ విషయం పోలీసులకు దృష్టికి తీసుకెళ్లానని ఓబన్న తెలిపారు.

**ఫిర్యాదు చేసినా..**

పోలీసులకు ఫిర్యాదు చేసినా వారి నుంచి సరైన స్పందన ఉండడం లేదని బాధత రైతులు వాపోతున్నారు. కనీసం కేసులు కూడా నమోదు చేయడం లేదని వాపోతున్నారు. ఎఫ్ఐఆర్ నమోదు చేస్తే ఉన్నతాధికారుల సమీక్షలో పురోగతిపై ప్రశ్నించే అవకాశం ఉందనే ఉద్దేశంతో జాప్యం చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.



ఓబులంలపల్లెలో నరికేసిన టేకు చెట్టు

**నిఘా పెట్టాం**



రైతుల కేబుల్ వైర్లు దొంగిలించుకుపోతున్న విషయం నా దృష్టికి వచ్చింది. క్రైం మీటింగ్‌లో కూడా దీనిపై చర్చించాం. అదుపు చేసే దిశగా చర్యలు చేపట్టాం. త్వరలోనే నిందితులను పట్టుకుని తగిన బుద్ధి చెబుతాం. గ్రామాల్లో వీలైతే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే అనుమానితులను గుర్తించే అవకాశం ఉంటుంది.

–కంబగిరి రాముడు, సీఐ

### క్లాట్‌లో మెరిసిన షణ్ముఖప్రియ



నంద్యాల(వ్యవసాయం): క్లాట్ (కామన్ లా అడ్మిషన్ టెస్ట్) 2024 ప్రవేశ పరీక్షలో పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది కూరాకుల చంద్రమౌళి, విజయలక్ష్మి దంపతుల కుమార్తె షణ్ముఖప్రియ ఆలిండియాలో 1,006 ర్యాంకు, ఆంధ్రప్రదేశ్‌లో 6వ ర్యాంకు సాధించింది. షణ్ముఖప్రియ పదవ తరగతి వరకు నంద్యాల ఆర్‌జీఎం ఇంటర్నేషనల్ స్కూల్‌లో, ఇంటర్మీడియెట్ హైదరాబాద్‌లోని ఎన్‌టీఆర్ జూనియర్ కాలేజీలో విద్యను అభ్యసించింది. ఆమె మాట్లాడుతూ.. డిసెంబర్ 1న ప్రవేశ పరీక్ష నిర్వహించగా సోమవారం క్లాట్ ఫలితాలు వెలువడ్డాయన్నారు. తన లక్ష్యం జడ్జిగా పోస్టును సాధించి పేద ప్రజలకు సముచిత న్యాయాన్ని అందించడానికి కృషి చేస్తానని చెప్పారు.

### ఘనంగా చర్చి వార్షికోత్సవం



విద్యుత్ దీపాలతో ముత్యాలపాడు ఎస్‌పీజీ చర్చి

చాగలమర్రి:మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో వెలసిన ఎస్‌పీజీ చర్చి 133వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. చర్చి ఫాదర్ రెవరెండ్ సంజీవరాజ్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథులుగా కర్నూలు ఆర్‌ఆర్ నగర్‌కు చెందిన డీసీ రెవరెండ్ టీఎస్ ఇస్సాక్ ప్రసన్న కుమార్, ముత్యాలపాడు చర్చి డీసీ వైస్ ప్రెసిడెంట్ వరప్రసాద్ రావు హాజయ్యారు. చర్చిలో ఉదయం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. శిలువతో చర్చి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో క్రైస్తవ మత గురువులు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

### చెన్నుపాటి ఆశయ సాధనకు కృషి

నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయుల హక్కుల కోసం పోరాడిన చెన్నుపాటి లక్ష్మయ్య ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామచంద్రారెడ్డి, శివయ్య పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం స్థానిక కార్యాలయంలో చెన్నుపాటి లక్ష్మయ్య వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మేనేజ్‌మెంట్ విద్యాసంస్థల ఉపాధ్యాయులను ఒకే యూనియన్‌గా మార్చడంలో ఆయన కృషి అభినందనీయమన్నారు. 1947లో రాష్ట్ర మహాసభలను నిర్వహించి ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారన్నారు. ఉపాధ్యాయ పత్రికను ప్రారంభించి ప్రధాన సంపాదకులుగా వ్యవహరించారని గుర్తు చేశారు. 1962లో గుంటూరు జిల్లా ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి శాసన మండలికి ఎన్నియ్యారని చెప్పారు. రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ భాస్కరరెడ్డి, సబ్ కమిటీ సభ్యులు వీరేశ్వరరెడ్డి, తిమ్మారెడ్డి, దస్తగిరి బాషా, రాజేష్, శ్రీరాములు, మధు పాల్గొన్నారు.

### వేరుశనగ పంట పరిశీలన



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

దొర్నిపాడు: మండలంలోని గుండుపాపల గ్రామానికి చెందిన రైతు ఉమామహేశ్వరరావు సాగుచేసిన వేరుశనగ పంటను శాస్త్రవేత్తలు డాక్టర్ రాధాకుమారి, కిరణ్‌కుమార్, వెంకటరమణమ్మ, వెంకటరమణ మంగళవారం పరిశీలించారు. 2024 ఆగస్టు 12న నేషనల్ సీడ్స్ కార్పొరేషన్ లిమిటెడ్ నంద్యాల వారి నుంచి వేరుశనగ విత్తనాలను కొనుగోలు చేసి విత్తనాలు సాగుచేశానని కానీ మొక్కలకు కాయలు లేవని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శాస్త్రవేత్తలు గ్రామానికి చేరుకుని వేరుశనగ మొక్కలను రైతు సమక్షంలో పరిశీలించారు. విత్తన మోతాదు, పంటకు నీటి తడులు, చదరపు మీటరుకు ఉండాల్సిన మొక్కలు తదితర అంశాలపై ఆరా తీశారు. వీటన్నింటినీ సమన్వయం చేసుకుని రెండుమూడు రోజుల్లో నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. ఎన్ఎస్‌సీ ఏరియా మేనేజర్ మోహన్‌రావు, మండల వ్యవసాయాధికారి ప్రమీల్, వీఏఏ గురుగోవర్ధన్ ఉన్నారు.

### గర్భిణులు ఆరోగ్య సూత్రాలు పాటించాలి

ఉయ్యాలవాడ: గర్భిణులు ఆరోగ్య సూత్రాలు పాటించాలని వైద్యాధికారులు రాబర్ట్‌కెనడి, వినోద్ కుమార్ సూచించారు. సోమవారం మండలంలోని మాయలూరు పీహెచ్‌సీ, ఉయ్యాలవాడలోని 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాలకు చెందిన 50 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వైద్యులు మాట్లాడుతూ.. మహిళలు గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవించే వరకు ప్రతి నెలా డాక్టర్లను సంప్రదించి సూచనలు, సలహాలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం మాతా శిశు మరణాల రేటును తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పాలు, గుడ్లు, తదితర పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా తల్లి, బిడ్డకు శ్రేయస్కరమన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవం జరిగితే వెంటనే జనని సురక్షణ యోజన పథకం కింద రూ. 1000 నగదు, ఎన్టీఆర్ బేబి కిట్లు అందజేస్తారని తెలిపారు. హెల్త్ సూపర్‌వైజర్లు మునిస్వామి, క్రిష్ణ, దస్తగిరి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

### జాతీయ స్థాయిలో క్రీడాకారుల ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): షటిల్ బ్యాడ్మింటన్ జాతీయ స్థాయి పోటీల్లో స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాల విద్యార్థులు రన్నర్‌గా నిలిచి ప్రతిభ విద్యాసంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం కళాశాలలోని క్రీడాకారులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. గత నెల కర్ణాటక రాష్ట్రంలో జరిగిన సౌత్‌జోన్ ఇంటర్ కాలేజీగేట్ ఉమెన్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీలో పాల్గొన్నారని చెప్పారు. ముఖ్యఅతిథిగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ రాఘవయాదవ్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో రెండో స్థానాన్ని కైవసం చేసుకున్న క్రీడాకారులను అభినందించారు. అధ్యాపకులు ఇంతియాజ్ అహమ్మద్, తదితరులు పాల్గొన్నారు. అలాగే కళాశాలలో సోమవారం అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఇందుకు చీఫ్ మేనేజర్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జనరల్ మేనేజర్ పూర్ణచంద్రారావు హాజరై మాట్లాడారు.

### సకల శాస్త్రాల సారాంశం భగవద్గీత



బహుమతులు అందుకున్న విద్యార్థులు

నంద్యాల(వ్యవసాయం): భగవద్గీత సకల శాస్త్రాల సారాంశమని తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ అధికారి డాక్టర్ మల్లు వెంకటరెడ్డి అన్నారు. స్థానిక పద్మావతినగర్‌లోని శ్రీకృష్ణ మందిరంలో భగవద్గీత కంఠస్థ పఠన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులకు నగదుతో పాటు రామాయణ సంగ్రహ గ్రంథాలను అందజేశారు. 6, 7 తరగతుల్లో సుస్మిత ప్రథమ, చతురస్త్రీ ద్వితీయ, హనీషా తృతీయ, 8, 9 తరగతుల విభాగంలో సూర్య ధరణి ప్రథమ, తరుణ్ ద్వితీయ, షణ్ముకేశ్వరి తృతీయ స్థానంలో నిలిచారు. పార్వతి, డాక్టర్ ఎస్.దేవి, దయానందసింగ్, భానోజీరావు, శిరీష, సంగీత,దీపిక, పుష్పలత, భాను న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

### కేంద్రం పాత్రపై దర్యాప్తు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): కొందరు వ్యాపార వేత్తలను ప్రోత్సహించడంలో కేంద్ర ప్రభుత్వ పాత్రపై దర్యాప్తు చేయాలని సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు సోమవారం డిమాండ్ డే కార్యక్రమం నిర్వహించారు. సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్, కార్యవర్గ సభ్యులు భాస్కర్, ఏఐటీయూసీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రభుత్వం అదానీ సంస్థలకు మేలు జరిగే విధంగా నడుచుకుంటుందన్నారు. నిరుద్యోగాన్ని నిర్మూలిస్తామని చెప్పినా అమలు కాలేదన్నారు. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోవడం వల్ల సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు సుశీలమ్మ, తులసమ్మ, చాంద్‌బాషా, రంజిత్, రవి, మస్తాన్, సుధాకర్ పాల్గొన్నారు. అలాగే.. గోస్పాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. నాయకులు బాబాఫక్రుద్దీన్, సోమన్న మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వైఫల్యాలు వ్యతిరేకిస్తూ కార్పొరేట్ సంస్థల విద్యుత్ ఒప్పందాల్లో అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు న్నాయని తెలిపారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చేసే ప్రయత్నాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ షేక్ మొహిద్దీన్‌కు వినతి పత్రం అందజేశారు. హరినాథ్, జిలానీ, నాగరాజు, దస్తగిరి, ఎల్లయ్య, గోకారి పాల్గొన్నారు.

### వైభవం.. అయ్యప్పస్వామి గ్రామోత్సవం



ప్రత్యేక మండపంలో ఆశీనులైన అయ్యప్ప స్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, విఘ్నేశ్వరుడు



గరుడ వాహనంపై విహరిస్తున్న అయ్యప్పస్వామి



దీపాలతో స్వాగతం పలుకుతున్న మహిళలు

నంద్యాల(వ్యవసాయం):పట్టణంలోని గుడిపాటిగడ్డలో వెలసిన అయ్యప్పస్వామి దేవస్థానంలో 45వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మండలి విళక్కి పూజ మహోత్సవ వేడుకలు గ్రామోత్సవంతో సోమవారం ముగిశాయి. ఉదయాన్నే కన్యస్వాములతో సింగారి మేళ వాయిద్యాలతో ఆలయం నుంచి పురవీధుల గుండా స్థానిక చెరువు కట్ట వద్దకు వెళ్లి కలశాలతో జలాన్ని తీసుకొచ్చారు. అనంతరం అయ్యప్పస్వామి ఉత్సవ మూర్తికి విశేష తిరుమంజనం, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూలంగి సేవ జరిపించి మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం పాలకొమ్ముతో అయ్యప్ప మాలధారులు ఉత్సవమూర్తిని పురవీధుల గుండా కేరళ సింగారి మేళంతో, పేటతుళ్లితో మాలధారులు భజనలు.. మహిళలు అడుగడుగునా దీపాలతో స్వాగతం పలుకగా గ్రామోత్సవం వేడుకగా సాగింది. ఆలయం నుంచి గాంధీచౌక్, కల్పనా సెంటర్, శ్రీనివాససెంటర్ నుంచి ఆలయానికి చేరుకుంది. అనంతరం పడిపూజ మహోత్సవం చేపట్టి ఊంజల సేవ, మంగళ హారతులు ఇచ్చి హరివరాసనంతో విళక్కి మహోత్సవ వేడుకలను ముగించారు. కార్యక్రమంలో ఎస్ఎండీ ఫయాజ్, రామచంద్రారావు, పసుపులేటి జనార్ధన్, మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, గంగాధర్, శ్రీకాంత్, గోపాలకృష్ణమూర్తి, కండే శ్యాంసుందర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

### ముగ్గురు నామినేషన్లు

ఉయ్యాలవాడ: మండలంలోని రూపనగుడి గ్రామంలో విజయ పాల సొసైటీ డైరెక్టర్ల స్థానానికి ముగ్గురు నామినేషన్లు వేసినట్లు విజయడైరీ నిర్వహణ అధికారి ఈశ్వరయ్య తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. సొసైటీ పరిధిలో ఇద్దరు డైరెక్టర్లను ఎన్నుకోవాల్సి ఉండగా గ్రామానికి చెందిన ఎగ్గోని నాగశేషమ్మ, వెంకటనారాయణ, వెంకటసుబ్బారెడ్డి నామినేషన్లు వేశారన్నారు. మంగళవారం పరిశీలన, అదే రోజు ఉపసంహారణకు అవకాశం ఉంటుందన్నారు. డెయిరీ పరిధిలో 16 మంది ఓటర్లు ఉన్నారన్నారు. పోటీ అనివార్యమైతే పోలింగ్ ఉంటుందన్నారు.

### తప్పిన ప్రమాదం



మలుపు వద్ద కాల్వలోకి దూసుకెళ్లిన శనగల లారీ

దొర్నిపాడు: శనగల లోడుతో వెళ్తున్న ఓ లారీ అదుపుతప్పి కాల్వలోకి దూసుకెళ్లింది. మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలోని ఓ గోదాము నుంచి సోమవారం లారీ 200 క్వింటాళ్ల శనగలను లోడ్ చేసుకుని గుంటూరు బయలుదేరింది. గ్రామ శివారులోని గాడిదొంగలోనే అదుపు తప్పబోయిన లారీ కోవెలకుంట్ల మండలం కంపమల్ల, క్రిష్టిపాడు గ్రామాల మధ్య మలుపు వద్ద కాల్వలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఓవైపు దారి ఉండడంతో రాకపోకలకు సైతం ఇబ్బందులు కలగలేదు. లేకపోతే రెండు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడేవారు. లారీలోని శనగ బస్తాలను ట్రాక్టరు ద్వారా మరో ప్రాంతానికి తరలించి లారీని బయటకు తీశారు.

### సమన్వయంతో జిల్లాను అగ్రభాగాన నిలుపుదాం



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల అమలులో అధికారుల బృందాలు సమన్వయంతో పని చేసి అన్ని పారామీటర్లలో జిల్లాను ముందు స్థానంలో ఉంచేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజ కుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో భాగంగా జిల్లా అధికారులతో కో-ఆర్డినేషన్ అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ డీఆర్‌డీఏ, డీఎంఅండ్‌హెచ్‌ఓ ఇతర శాఖలు ప్రాధాన్యత కార్యక్రమాల లక్ష్య సాధనలో వెనుకబడిన అంశాలను తన దృష్టికి తీసుకొచ్చి సమీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో వరి, ఇతర ధాన్యపు పంట దిగుబడులను రోడ్లపై ఆరబోస్తున్నారని అకాల వర్ష కారణంగా ధాన్యం తడవకుండా రైతులను అప్రమత్తం చేయాలని సూచించారు. ఈ– పంట, బీమా ప్రీమియం చెల్లింపు కింద వివిధ పంటలకు తక్కువ రుసుమును ఫ్యూచర్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీకి చెల్లిస్తే దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లిస్తుందన్న అంశాలపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కలిగించాలన్నారు. తొలిరోజు నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో భూ సమస్యలపై 430 గ్రీవెన్స్ వచ్చాయని వీటన్నింటిని ఆన్‌లైన్ చేసి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆదివారం జరిగిన జెడ్పీ సమావేశంలో సభ్యులు లేవనెత్తిన దొర్నిపాడు బాయ్స్ హాస్టల్ సమీపంలో ఉన్న వైన్ షాపుపై చేసిన ఫిర్యాదును పరిశీలించి నివేదిక ఇవ్వాలన్నారు. సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలను షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలని చెప్పారు. మెగా పేరెంట్ టీచర్ల సమావేశాన్ని విజయవంతంగా పూర్తి చేసినందుకు అధికారులను అభినందించారు. జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ ,డీఆర్‌ఓ రామునాయక్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం



ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరైన అధికారులు

ఉయ్యాలవాడ: ప్రజా సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు సూచించారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన అధికారులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చే అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. కొందరు అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారని, సరైన రీతిలో స్పందించకపోవడంతోనే మండల స్థాయిలో పరిష్కారం లభించడం లేదని బాధితులు జిల్లా కేంద్రానికి వెళ్తున్నారని గుర్తు చేశారు. నిర్లక్ష్యం వహించే అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

### ముమ్మరంగా ఇంటింటి సర్వే



సర్వేను తనిఖీ చేస్తున్న నోడల్ అధికారి

శిరివెళ్ల: జిల్లాలో అసంక్రమిత వ్యాధులు బీపీ, షుగర్, హిమోగ్లోబిన్‌పై ముమ్మరంగా ఇంటింటి సర్వే జరుగుతోందని నోడల్ అధికారి కాంతారావు నాయక్ తెలిపారు. సోమవారం స్థానిక సబ్ సెంటర్‌లో జరుగుతున్న ఇంటింటి సర్వేను తనిఖీ చేశారు. నవంబర్ 14వ తేదీ నుంచి సర్వే జరుగుతోందన్నారు. 18 ఏళ్లు దాటిన వారికి బీపీ, షుగర్, హిమోగ్లోబిన్ పరీక్షలు గుర్తిస్తున్నామన్నారు. 30 ఏళ్లు దాటిన వారికి నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్‌పై సిబ్బంది ఇంటింటికి తిరిగి సర్వే చేస్తున్నారన్నారు. బీపీ, షుగర్ నిర్ధారణ అయిన వారికి డాక్టర్‌తో ట్రీట్‌మెంట్ ఇప్పిస్తున్నామని తెలిపారు. క్యాన్సర్ అనుమానితులకు పరీక్షలు చేయించి తగిన వైద్యం చేస్తున్నామని పేర్కొన్నారు. అసంక్రమిత వ్యాధులను ముందుగానే గుర్తించి చికిత్స చేయిస్తే మరణాల నుంచి కాపాడుకోవచ్చని తెలిపారు. సీహెచ్‌ఓ రాంమోహన్‌రెడ్డి, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.